




మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

రాష్ట్రంపై కక్షగట్టారు..!

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం
- చెంబు సంస్కృతి కొనసాగించారు...
- అడిగిన వాటిపైనా స్పందించలేదు..
- రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు నోరు మెదపరు
- మండిపడ్డ ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై ప్రధాని కక్ష గట్టారని, ఎటువంటి కేటాయింపులు, గ్రాంట్లు అందించకుండా కేంద్రబడ్జెట్‌లో తీరని అన్యాయం చేశారని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. రాష్ట్రానికి ఏటా చెంబు పెట్టేలాంటి సంస్కృతి కొనసాగించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మైసూరులో కేంద్రబడ్జెట్‌పై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌కు ముందు జరిగిన సభలో పలు ప్రతిపాదనలు చేశామని, అయితే ఒక్కటి కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఢిల్లీలో రైతులు నిరసన తెల్పుతున్నా వాటిపై ప్రస్తావన లేదని, అన్నదాతలకు అత్యంత తీవ్రమైన ద్రోహం చేశారన్నారు. రాష్ట్రం నుంచి కేంద్రంలో మంత్రులుగా కొనసాగేవారు ఒక్కరు కూడా రాష్ట్ర సంక్షేమం గురించి నోరు తెరవలేదన్నారు. రాష్ట్రానికి ఎందుకు అన్యాయం చేశారని బీజేపీ, జేడీఎస్ ఎంపీలు ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలకు అన్యాయమే అన్నారు. బీజేపీ-జేడీఎస్ పొత్తు ఉన్న రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రధానమంత్రికి విన్నవించాలని రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలను కోరారు. మను స్మృతిని వ్యతిరేకించి రాజ్యాంగానికి మద్దతుగా నిలుస్తున్న రాష్ట్రాలపై బీజేపీ ప్రభుత్వం పగ తీర్చుకుందన్నారు. ఆదాయపన్ను రూ.12లక్షల పరిమితికి పెంచడాన్ని కొనియాడుతున్నారని, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపన్ను చెల్లించినవారు 8.09 కోట్లమంది మాత్రమే అన్నారు. ఇది జనాభాలో 6.64శాతం కానుందని, వీరిలోనూ 4.09 కోట్లమంది జీరోట్యాక్స్ చూపినవారే అన్నారు. దీన్నిబట్టి పరిమితి పెంచినా వచ్చే లాభం లేదన్నారు. రోజువారీ రూ.100-150 ఆదాయం కల్గినవారు దేశంలో 70శాతం మంది ఉన్నారని వీరికి ఎటువంటి లాభం లేదన్నారు. 2024-25 బడ్జెట్‌లో 47,16,000 లక్షల కోట్లుగా ఉండేదని 1,04,000 కోట్లు పన్ను తగ్గిందని, వారి అంచనాలకు తగ్గట్టుగా సేకరణ సాధ్యం కాలేదనే అర్థం అన్నారు. బడ్జెట్‌ను రూ.50.65 లక్షల కోట్లకు పెంచారని ఇందులో 15.68 లక్షల కోట్లు రుణంగా ఉందని 12.70 లక్షలకోట్లు వడ్డీకే పోనుందన్నారు. దేశంలో రుణం రూ.202 లక్షల కోట్లనుంచి 2026 మార్చికి రూ.205 లక్షల కోట్లకు పెరగనుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలోని 11 బడ్జెట్‌లు చూశామని పన్నెండో బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోలేదన్నారు. ఇది వికసించే బడ్జెట్ కాదని, అధోగతికి తీసుకెళ్లే బడ్జెట్ అన్నారు. కర్ణాటక రాష్ట్ర ప్రాధాన్యతలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించామని, కానీ కనీసస్థాయిలో కూడా గ్రాంట్లు లేవన్నారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక ప్రజలు బీజేపీకి 46శాతం ఓటింగ్ వేసినా రాష్ట్రంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ కక్ష గట్టారన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన గ్రాంట్లలోనూ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజనలోనూ గ్రాంటు పెంచాల్సి ఉందని 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన 5495 కోట్ల రూపాయలు ఇవ్వలేదన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పిస్తారనే ప్రస్తావన లేదన్నారు. కళసా-బండూరి, మేకెదాటు ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. వెనుకబడిన కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం రూ.5వేల కోట్లు స్పెషల్ ప్యాకేజీ కోరినా బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనలు లేవన్నారు. బెంగళూరు అభివృద్ధిలో భాగంగా సబర్బన్, రింగ్‌రోడ్డు, మెట్రో విస్తరణకు సహకరించలేదన్నారు. కేంద్రబడ్జెట్ అనేది దేశ అభివృద్ధికి దిశానిర్దేశంగా ఉండాలని ఆ విధంగా వారు ఆలోచించలేదన్నారు. దేశ ప్రగతికి ఇంజన్‌లుగా చెప్పుకొనే మెట్రో నగరాలకు ఏ విధమైన ప్రత్యేక సౌలభ్యాలు చూపలేదన్నారు. కన్నడిగులకు, కర్ణాటకకు ఇదో నిరాశాదాయకమైన బడ్జెట్ అన్నారు.

అధినేతల్లో.. ఆందోళన..!



- మూడు పార్టీల్లోనూ భిన్నస్వరాలే
- చుక్కలు చూపిస్తున్న రెబెల్స్
- హైకమాండ్ హెచ్చరించినా దళిత మంత్రుల భేటీ
- కమలదళంలో అధ్యక్ష హోదాకోసం పోటాపోటీ..
- జేడీఎస్‌లో పెద్దాయనకూ తప్పని తలపోటు..!

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయ పార్టీలు క్రమశిక్షణకు మారుపేరు అనే తీరు అధిష్ఠానంలో దశాబ్దాలకాలంగా కొనసాగింది. ఇక్కడి రాజకీయ నేతలంటే గ్రూపు విభేదాలు ఉండవని, సమష్టిగా పనిచేస్తారనే విశ్వాసం కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతల్లో అభిప్రాయాలు ఉండేవి. ప్రాంతీయ పార్టీ జేడీఎస్‌లో కీలకనేత దేవెగౌడ గీతగీస్తే దాటేవారు లేరని, వారు రాష్ట్రమంతటా ప్రాబల్యం చూపకపోయినా వారికి పట్టు కల్గిన జిల్లాల్లో పదవి, ఏ స్థాయి ఎన్నికల టిక్కెట్ అయినా దేవెగౌడ నిర్ణయిస్తే అభ్యంతరాలు ఉండవనేలా సాగింది. ఇదంతా ఒకప్పటి మాట. రాష్ట్రంలోని మూడు రాజకీయ పార్టీల్లోనూ భిన్నస్వరాలు కేవలం రహస్యంగా కాదు ఏకంగా తేల్చుకుందామనే రీతికి చేరాయి. అధిష్ఠానం హెచ్చరించినా అల్టిమేటం జారీ చేసినా తమకు సంబంధం లేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయోనని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఢిల్లీ నేతలు తలపట్టుకునే పరిస్థితి ఏర్పడింది.


ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ గొడవలు..

అధికార కాంగ్రెస్ పార్టీలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ మధ్య విభేదాలు ఢిల్లీ కేంద్రంగా పంచాయతీలు సాగే పరిస్థితి ఏర్పడింది. సీఎం, డీసీఎం తరచూ తాము అన్యోన్యంగా ఉన్నామని, తమ మధ్య విభేదాలు లేవని పదే పదే చెబుతున్నారు. కానీ ఎవరికివారు అవకాశం కోసం ఎంతటికైనా సిద్ధం అనేలా వ్యవహరిస్తున్నారు. కొత్త ఏడాది ప్రారంభంలో మంత్రుల విందు భేటీల పరంపరకు సిద్ధమయ్యారు. తొలుత సతీశ్ జార్కిహొళి నివాసంలో విందు జరపగా సీఎం సిద్దరామయ్యతోపాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఆ వెంటనే హోం మంత్రి పరమేశ్వర్ ఇంట్లో విందుకు ఆహ్వానించారు. అప్పటివరకు టర్కీ పర్యటనలో ఉన్న డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీకి చేరుకున్నారు. అధిష్ఠానం ముందు సమస్యను వివరించారు. దీంతో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా సీరియస్‌గా తీసుకున్నారు. గంటల వ్యవధిలోనే పరమేశ్వర్ విందుకు బ్రేక్ చెప్పారు. ఈలోగా నాయకత్వ మార్పు, కేపీసీసీ అధ్యక్షుడి మార్పు అంశాన్ని ఎవరూ ప్రస్తావించరాదని అల్టిమేటం జారీ చేశారు. రెండువారాలపాటు మౌనంగా ఉన్న నేతలు అదే తంతు కొనసాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం విధానసౌధలోని హోం మంత్రి పరమేశ్వర్ కేబిన్‌లో మంత్రులు రాజణ్ణ, సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప భేటీ అయ్యారు. ఇలా సాగుతుండగానే సతీశ్ జార్కిహొళి కొంతమంది ఎమ్మెల్యేలతో కలసి దుబాయ్ పర్యటనకు సిద్ధమయ్యారు. గతంలోనూ ఆయన దుబాయ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించి అధిష్ఠానం సూచనతో వెనుకడుగు వేశారు. ప్రస్తుతం టిక్కెట్లు సమకూర్చుకోవడంతోపాటు అన్నింటినీ సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా జార్కిహొళి కూటమి ప్రస్తావనలో ఒకరికి ఒకే పదవి ఉండాలని, కానీ కేపీసీసీ అధ్యక్ష పదవితోపాటు డీసీఎంగా కొనసాగుతున్న డీకే శివకుమార్‌కు చెక్ పెట్టాలనేది వీరి ప్రధానమైన డిమాండ్‌గా ఉంది. కేపీసీసీ అధ్యక్ష పదవికాలం ముగియడంతో కొత్తవారికి ఇవ్వాలనేది వీరి ప్రధానమైన ప్రస్తావనగా ఉంది. మరోవైపు డీకే శివకుమార్ నాయకత్వ మార్పు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ముగిశాక ఈ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రతిపాదనను తిప్పికొట్టాలనే దుబాయ్ పర్యటనతోపాటు రహస్యభేటీలు సాగుతున్నాయి. ఈ పరిస్థితి ఎక్కడికి దారి తీయనుందోనని అధిష్ఠానం త్వరలోనే రంగంలోకి దిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

బీజేపీ అధ్యక్ష పదవికి ఢీ అంటే ఢీ..

బీజేపీలో అధిష్ఠానం అంటే అందరికీ హడలేననే అభిప్రాయాలున్నాయి. అయితే రాష్ట్ర బీజేపీలో గ్రూపు విభేదాలు ఎవరికి వారే అనేలా బహిరంగంగానే సవాళ్లకు సిద్ధమయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్రను తప్పించడమే లక్ష్యంగా పార్టీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళి తదితరులు నిరంతరంగా సమావేశాలు జరుపుతున్నారు. వీరికి పలువురు మద్దతు ఇస్తున్నా తాజాగా చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ సుధాకర్ కూడా చేరడం మరింత బలాన్నిచ్చినట్లయ్యింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షస్థానానికి అధిష్ఠానం నుంచి అనుమతులు పొందాలని యత్నాళ్ కూటమి ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి వచ్చారు. మరోసారి హస్తినలోనే ప్రయత్నించాలని భావిస్తున్నారు. కానీ పార్టీ అధ్యక్షుడిగా మరో పర్యాయం కొనసాగుతానని బహిరంగంగానే విజయేంద్ర సవాల్ విసురుతున్నారు. ఇలా ఎవరికివారు ప్రయత్నాలు చేస్తుండగానే పలు జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నిర్ణయం విభేదాలకు మరింత ఆజ్యం పోసినట్లయ్యింది. ఇక పార్టీలో అలజడి లేసింది. బళ్ళారి కీలక నాయకులు శ్రీరాములు, గాలి జనార్ధనరెడ్డి మధ్య విమర్శలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. ఒకానొక దశలో శ్రీరాములు పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధం కాగా అధిష్ఠానం ఢిల్లీ రావాలని సూచించింది. దీంతో తాత్కాలికంగా శ్రీరాములు అడుగుకు బ్రేక్ పడింది. ఇలా బీజేపీలో తారస్థాయికి చేరిన గ్రూపు విభేదాలకు స్వస్తి పలికించేందుకు ఢిల్లీనేతలు వస్తున్నట్టు తెలుస్తోంది.

దేవెగౌడపై ధిక్కారస్వరం..!



జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్)లో విభేదాలు గత ఏడాది నుంచి తారస్థాయిలో కొనసాగుతున్నాయి. అందరినీ ఒకగాటికి తెచ్చేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ కేంద్ర మంత్రి కుమారస్వామి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టడం మినహా కొలిక్కిరావడం లేదు. జేడీఎస్ బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం దూరమయ్యారు. ఆ తర్వాత కొనసాగిన తర్జనభర్జనల తర్వాత కుమారస్వామి తాత్కాలిక అధ్యక్షుడు అయ్యారు. అయితే కుమారస్వామి అనూహ్యంగా కేంద్రంలో మంత్రి కావడంతో ఆ పార్టీ అధ్యక్షపదవి ఖాళీ అయ్యింది. నెలక్రిందటే కొత్త అధ్యక్షుడిని నియమించేందుకు ప్రత్యేక సభ జరిపినా కొలిక్కి రాలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నిఖిల్‌ను ఖరారు చేయాలని దేవేగౌడ, కుమారస్వాములు భావిస్తున్నారు. అయితే ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ ఏడాదిగా పార్టీ కలాపాలకు దూరంగా ఉన్నారు. ఆయనను పార్టీలో క్రియాశీలకం చేసే ప్రయత్నాలు అడుగడుగునా బెడిసికొడుతున్నాయి. ఇలా జేడీఎస్‌లో విభేదాలు కొలిక్కి రావడం లేదు. ఇలా ప్రధానమైన మూడు పార్టీల్లోనూ అధినేతలకు రెబల్స్ చుక్కలు చూపిస్తున్నారు.



సీఎం సలహాదారుడి పదవికి బీఆర్ పాటిల్ రాజీనామా



బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీలో సంచలనం రేగింది. పార్టీ సీనియర్ నేత, కలబురగి జిల్లా అళంద నియోజకవర్గ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ సీఎం సలహాదారుడి పదవికి రాజీనామా చేశారు. సదరు లేఖను ముఖ్యమంత్రికి శనివారం పంపారు. ఉన్నఫళంగా బీఆర్ పాటిల్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చనీయాంశమయ్యింది. సిద్దరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తోందని ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదని పలుమార్లు బీఆర్ పాటిల్ మండిపడ్డారు. గతంలో సీనియర్ నేతలు బసవరాజరాయరెడ్డి, ఆర్‌వీ దేశ్‌పాండేలతోపాటు బీఆర్ పాటిల్ తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై మండిపడ్డారు. సీఎం తీరును తప్పుబట్టిన విషయం తెలిసిందే ఆ వెంటనే సీఎం సిద్దరామయ్య జోక్యం చేసుకుని బసవరాజ రాయరెడ్డికి సీఎం రాజకీయ కార్యదర్శిగానూ, బీఆర్ పాటిల్‌కు పాలన, అభివృద్ధి విభాగాలకు సీఎం సలహాదారుడిగా నియమించారు. ఇద్దరికి కేబినెట్ హోదా కల్పించారు. అయితే బీఆర్ పాటిల్ సలహాదారుడి పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వం నుంచి సలహాదారుడి హోదాకు దక్కే ఎటువంటి సౌకర్యాలను పొందేది లేదని రాజీనామాలో స్పష్టం చేశారు. ప్రధానంగా కలబురగి జిల్లాకు చెందిన మంత్రి ప్రియాంకఖర్గే, రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ తమ పట్ల చులకనగా మాట్లాడారని గతంలోనూ మండిపడిన విషయం తెలిసిందే. బీఆర్ పాటిల్ సలహాదారుడి పదవికి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో కలకలం రేగినట్లు తెలుస్తోంది.

సమాజసేవతోనే జీవితానికి పరిపూర్ణత

- పుట్టినరోజు వేడుకల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి



స్థానికులకు కుక్కర్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనవసర ఖర్చులు చేయకుండా సమాజ సేవా కార్యక్రమాల జీవితానికి పరిపూర్ణత సాధ్యమని అర్థవంతంగా పుట్టినరోజు జరుపుకోవాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అన్నారు. మహదేవపుర నియోజకవర్గంలో శనివారం పుట్టినరోజు సందర్భంగా పలు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. హోబళిలో పట్టణ, గ్రామీణ స్థాయి నాయకులు, కార్యకర్తలు 110 సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండూరు పంచాయతీ జ్యోతిపుర గ్రామంలో జ్యోతిలింగేశ్వర దేవస్థానంలో భార్య, ఎమ్మెల్యే మంజుళాతో కలసి ప్రత్యేక పూజల్లో పాల్గొని సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. జ్యోతిపురలో తాగునీటి విభాగాన్ని ప్రారంభించి, పాఠశాల విద్యార్థులు, పౌరకార్మికులు, ఆశా కార్యకర్తలకు యూనిఫాం, స్వీట్లు పంపిణీ చేశారు. వార్డులు, శక్తి కేంద్రాలలో విశేషపూజలు, హోమాలతోపాటు అన్నసంతర్పణ నిర్వహించారు. పౌరకార్మికులకు స్టీల్ వాటర్‌బాటిల్, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అంబలిపుర చెరువులో స్వచ్ఛతా అభియాన, బెస్కాం ఉద్యోగులకు కుక్కర్ పంపిణీ చేశారు. మారతహళ్ళిలోని శక్తికేంద్రం సమీపానగల వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం, కెంపాపుర పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అశ్వథనగర్ శక్తికేంద్రంలో వెయ్యిమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బళగెరె శక్తికేంద్రం నుంచి అనాథాశ్రమానికి భోజన వ్యవస్థ, పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. వైట్‌ఫీల్డ్, అంబేడ్కర్ గుట్ట శక్తి కేంద్రం ద్వారా అంధ పిల్లలకు భోజనం, పండ్లు సమకూర్చారు. భోగనహళ్ళి శక్తికేంద్రం నుంచి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ తలా వెయ్యి రూపాయల ప్రతిభా పురస్కారం, ఏఈసీఎల్ లే అవుట్‌లో అన్నదానం, రెండువేలమందికి కుక్కర్ పంపిణీ చేశారు. ముళ్ళూరులో ఫ్లడ్‌లైట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. తిగళరపాళ్య శక్తికేంద్రం తరపున కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. కొందరికి ఇళ్ల నిర్మాణానికి ధనసాయం అందచేశారు. కణ్ణూరు పంచాయతీ ఆధ్వర్యంలో గోవు ఆశ్రమానికి మేత, నిత్యావసరాలు, బిదరహళ్ళి పుష్కరిణిని స్వచ్ఛ పరిచి, చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటి స్థానిక పౌరకార్మికులకు భోజన వ్యవస్థ కల్పించారు.

కణ్ణూరులో గోసేవ

నియోజకవర్గంలోని కణ్ణూరులో పంచాయతీ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో గోపూజలో పాల్గొని పశువులకు మేత అందచేశారు. అనంతరం కణ్ణూరు, దొడ్డగుబ్బి, శివాలయాల సమీపాల్లోని ఆశ్రమాలను సందర్శించి అక్కడి వృద్ధులకు పండ్లు, బెడ్‌షీట్‌లు అందచేశారు. కణ్ణూరు పంచాయతీ అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ మాజీ మంత్రి లింబావళికి మూగజీవాలంటే ఎంతో అభిమానమని అందుకే గోపూజ చేయించామన్నారు. కార్యక్రమాలలో గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, ప్రముఖులు మనోహరనగర హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నటరాజ్, ఎల్ రాజేశ్, బిదరహళ్ళి రాజేశ్, మండూరు శ్రీనివాసగౌడ, దొడ్డగుబ్బి మారుతి, విసి గోశాల యజమాని కాంట్రాక్టర్ ఎం వెంకటాచలపతి, లలితా దేవరాజ్, తమ్మణ్ణ, వేణు, లక్ష్మీనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



గోపూజలో లింబావళి



మధ్య తరగతికి బంపర్ బడ్జెట్ 9

- ప్రతిపక్షనేత అశోక్

కోటెకారు బ్యాంకు దోపిడీ దొంగ

తప్పించుకునేయత్నం 9


- కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్న పోలీసులు



ధర లేక పొలాల్లోనే

కొత్తిమీర

కొత్తిమీరను చూపుతున్న రైతు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

● కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌హెగ్డే



బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌హెగ్డె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు అధిక నిధులు ఇచ్చి కర్ణాటకకు సరిపడనిధులు ఇవ్వలేదన్నారు. ఇది రైతు పేద, యువత , మధ్యతరగతి ప్రజల వ్యతిరేక బడ్జెట్ అన్నారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రుల సాధన శూన్యమన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. నిరాశజనక బడ్జెట్ అని ఆవేదన వ్యక్తం చేశారు.

చురుగ్గా హగరి వంతెన పనులు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ పరిధిలోని పీడీహళ్లి సమీపంలో వంతెన పనులు ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్నాయి. వంతెన మరమ్మతుల కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నందున త్వరంగా పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. వంతెన పూర్తయితే సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఫిబ్రవరి నెలచివర కానీ మార్చి మొదటి వారంలో కానీ వంతెన ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.



వంతెనపై తారు వేసిన దృశ్యం

ఆయుష్మాన్‌లో అందని వైద్యం..!

● అరకొర సిబ్బందితో రోగులకు ఇబ్బందులు ● పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

గంగావతి రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) తాలూకా పరిధిలోని సణాపుర గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం(ఉపకేంద్రం)లో కొన్ని నెలల నుంచి వైద్య సిబ్బంది, మౌలిక సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఉన్నా లేనట్లుగానే తయారయ్యిం దని, వైద్య సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు ఉత్తమ ఆరోగ్యసేవలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్మాన్ భారత ఆరోగ్య కేంద్రం పథకంలో ఆరోగ్య కేంద్రాలను గతంలో హెచ్‌డబ్ల్యూసీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం దానిని తిరిగి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలుగా మార్చింది. ఆసుపత్రి కట్టడాలపై పేరు మారినా ప్రజలకు మాత్రం వైద్యసేవలు అందడం లేదు. సణాపుర గ్రామమే పంచాయతీ కేంద్రంగా ఉండడంతో ఈ గ్రామ పరిధిలోని సణాపుర, తిరుమలాపుర, జంగ్లి, కరియమ్మనగడ్డి, విరుపాపుర గడ్డిలతో పాటు మొత్తం 4,200 మంది జనాబా ఉంది. ఈ గ్రామంలో చాలామంది కూలీలు, వ్యవసాయ కూలీలే అధికంగా ఉన్నారు. సణాపురంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాల్లో ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా గంగావతి పట్టణానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది.



అపరిశుభ్రంగా మారిన ఆయుష్మాన్ కేంద్రం

సిబ్బంది సమస్య:- ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు, పరిశుభ్రత, సిబ్బంది కొరత కారణంగా ఆరోగ్య కేంద్రంలో సరగా వైద్య సేవలు అందడంలేదు. కేంద్రంలో వైద్య సిబ్బంది సరిగా ఉండడం లేదు, ఆరోగ్య కేంద్రం కాంట్రాక్టు పద్ధతిపై ఒక పీహెచ్‌సీఓ విధులు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది వసతి నిలయం దుస్థితికి చేరుకోవడంతో కేంద్రంలో వైద్య సిబ్బంది కేంద్ర స్థానంలో ఉండని కారణంగా ప్రజలకు అవసమైన సమయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు కూడా సిబ్బంది ఉండరని గంగావతికి వెళ్లక తప్పదని బాధితులు వాపోతున్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రిన్ని సుమారు 20 సంవత్సరాల క్రితం నిర్మించారు. కేంద్రంలో ఒకవైపు వైద్యం, మరోవైపు సిబ్బంది నివాసానికి వసతి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం నివాసాలు గదులు, మరుగుదొడ్లు దుస్థితికి చేరుకోవడంతో అవి సిబ్బంది నివాస యోగానికి పనికారాకుండా పోయాయి. గ్రామపంచాయతీ పీడీఓ పాలనా మండలి సభ్యులు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నిర్వహణ పట్ల నిర్లక్ష్యం కారణంగానే ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గంగవతి తాలూకా వైద్యాధికారులు సణాపురం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి మరమ్మతు చేపట్టి ప్రజలకు సరైన రీతిలో వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి వాణిజ్య పరిశ్రమల సంస్థ, తారానాథ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏపీఎంసీ యార్డ్ లో శనివారం ఉచిత కీళ్ల నొప్పుల చికిత్స శిబిరంలో 300మందికి పైగా రోగులు చికిత్స పొందారని వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఏపీఎంసీ యార్డ్‌లో శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేదానికి ప్రాచుర్యం కల్పిస్తున్నారు. ఆయురేత్వదంలో ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉందన్నారు. తారానాథ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల , ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ మాదవి దిగ్గవి మాట్లాడుతూ ఆయుర్వేద మందులతో చికిత్స అలస్యమయినా, ప్రతి జబ్బుకు పరిష్కారం ఉందన్నారు. కార్యక్రమంలో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు మంజునాథ్, మహారుద్రగౌడ, దొడ్డనగౌడ, సొంతగిరిదర్, రామచంద్ర, పుష్కర్ జైన్ సేవాసమతి అధ్యక్షుడు అశోక్ భండారి, బ్రోకర్ వర్తక సంఘం అధ్యక్షుడు చిదానందప్ప, కార్యదర్శి గురుస్వామి, సురేంద్రకుమార్ పాల్గొన్నారు. వైద్యులు కొట్రేశ్, డాక్టర్ రవి చౌహాన్ తదితరలు పబ్లిక్ హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి: ఎస్ఐ

● సరస్వతి పూజా కార్యక్రమంలో ఎస్ఐ కాళింగ



మాట్లాడుతున్న ఎస్ఐ కాళింగ

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టడపి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఐ కాళింగ సూచించారు. శనివారం ఎర్రగుడి మొరార్జీ స్కూలు ఆవరణలో పదవ తరగతి విద్యార్థులు ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని మొకా ఎస్ఐ కాళింగ మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కాళింగ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ భారతి, మీడియా సభ్యులు ఎర్రగుడి రమేష్, సూర్యకాంత రెడ్డి, ఉపాధ్యాయులు బసప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో ఏఐఎంఎస్ఎస్ సభ్యులు

బాలింత మృతిపై ఏఐఎంఎస్ఎస్ నిరసన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని బిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం ప్రసవం అనంతరం కోళూరు గ్రామ బాలింత శ్రీమతి మహాదేవి మృతి చెందడం కలకలం రేపింది. మృతురాలు మహాదేవి వయస్సు 21ఏళ్ళు కాగా సిజేరియన్ తర్వాత ఇన్‌ఫెక్షన్‌తో మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో బాలింతల మరణాల పరంపర కొనసాగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి హృదయ విదారక ఘటనపై అఖిల భారత మహిళా సాంస్కృతిక సంస్థ, ఏఐకేకేఎం ఎస్ రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బళ్లారి మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మరణించిన వారి కుటుంబానికి నష్టపరిహారం అందించాలని వినతి పత్రం అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని భారత రైతు, వ్యవసాయ సంఘాల బళ్లారి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఏఐఎంఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరీ, ఏఐకేకేఎంఎస్ జిల్లాధ్యక్షుడు గోవింద్ ఉన్నారు.

అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలి

● మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సమితి చైర్మన్ హెచ్. హనుమంతప్ప

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ వ్యతిరేకుల ఒత్తిళ్లతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంతర్గత రిజర్వేషన్ల అమలులో జాప్యం చేస్తున్నారని, అయితే తక్షణమే రిజర్వేషన్లు అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ చైర్మన్ హెచ్.హనుమంతప్ప హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంతర్గత రిజర్వేషన్ల అమలు కోసం ఏర్పాటైన నాగమోహన్ దాస్ కమిషన్ పదవీ కాలం ముగిసిందని, ఇంకా నివేదిక సిద్ధం చేయలేదన్నారు. అంతర్గత రిజర్వేషన్ల అమల్లో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. హర్యాలో అంతర్గత రిజర్వేషన్లు ఇప్పటికే అమలు చేస్తున్నా రన్నారు. తెలంగాణలో సబ్ కమిటీ వేసిందని, ఆంధ్రా ప్రాంతంలో ప్రక్రియను ప్రారంభించిందన్నారు. బీజేపీ హయాంలో మధుస్వామి సబ్ కమిటీ నివేదిక ఇచ్చినా అమలు చేయాలన్నారు. తక్షణమే రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మాదిగ కులాలకు 6శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్ని కమిషన్ల నివేదికలు చెబుతున్నాయి. కావున ప్రభుత్వం మధ్యంతర నివేదిక తెచ్చి తక్షణమే మాదిగ ఉపకులాలకు 6శాతం ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలి. మిగిలిన 11శాతం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించడానికి మాకు ఎటువంటి అభ్యంతర లేదన్నారు. సంస్థ నాయకులు కే.ఏ.ఈశ్వరప్ప, సి. సోమశేఖర్, రామన్న చెళ్లగుర్కి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

శ్రీశైలంలో అలరించిన కళాకారుల నృత్యం



కళాకారులను అభినందిస్తున్న ఈఓ శివారెడ్డి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని ధర్మపథం కళావేదికలో గురువారం బళ్లారికి చెందిన తుంగ-గంగా సాంస్కృతిక కళాట్రస్టు కాళాకారులు ప్రదిర్శించిన భరతనాట్యం, కూచిపూడి, నృత్యాలు భక్తులను అబ్బురపరిచాయి. శివపార్వతుల భక్తిగీతాలకు కళాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. దేవస్థానం ఈఓ శివారెడ్డి మాట్లాడుతూ బళ్లారి కళాకారులు సాంస్కృతిక కళలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జీఆర్.వెంకటేశులు, డా.వీణా, డా. ధృవ , అనన్య, ప్రీతి,ప్రగతి, రాధకృష్ణ, రాఘవి, రాధిక, జేష్న, నిపుణ, శ్రీనివాస్, నాగభూషణ్, ప్రమీద, జి.వెంకటేశులు, శివరుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి



ఊరేగింపులో ప్రతాప్‌రెడ్డి, మేయర్ నందీశ్ తదితరులు

బళ్లారి సిటీ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మడివాళ మాచిదేవయ్య తన వచనాల ద్వారా సమాజంలోని కల్మషాన్ని కడిగేశారని, భక్తిని దారపోసి ఎందరికో పాప విముక్తి కలిగించారని శ్రీమాచిదేవ యోగా మందిర్ ట్రస్ట్‌కు చెందిన బసరాజేంద్ర అన్నారు. నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో శనివారం జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, కన్నడసాంస్కృతిక శాఖ, మహానగర కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మడివాళ మాచిదేవ జయంతి కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. సమాజంలో గొప్ప వ్యక్తులలో మాచిదేవ ఒకరని, అందరికీ సమాన వాటాను అందించడానికి శరణులలో ఆయనే ప్రకాశవంతుడని ఆయన అన్నారు. మడివాళ మాచిదేవ క్రీ.శ 1120 లో బీజాపూర్ జిల్లా సిందగి తాలూకాలోని దేవ హిప్పరగిలో పారువతయ్య, సుజ్ఞానవ్వ దంపతులకు జన్మించారన్నారు. మడివాళ మాచిదేవ 12వ శతాబ్దంలో బసవన్న సమకాలీనులలో అవగాహన ద్వారా దోపిడీని అడ్డుకున్నారన్నారు. 12వ శతాబ్ద కాలంలో ఇలాంటి శరణుల మహనీయులు చేసిన మార్గదర్శకత్వం, ప్రతిజ్ఞనలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు మడివాళ మాచిదేవుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మడివాళ మాచిదేవ శోభయాత్రను వివిధ సాంస్కృతిక కళా బృందాలతో నిర్వహించారు. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ గ్రౌండులో శోభయాత్రను నగర మేయర్ ముల్లంగి నందీశ్ ప్రారంభించారు. ఊరేగింపు గడిగిచెన్నప్ప సర్కిల్ , బెంగళూరు రోడ్డు, తేరువీధి, గవియప్పసర్కిల్ మీదుగా జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలోని స్టేజ్ హాలుకు చేరుకుంది. ఈసందర్భంగా కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, జిల్లా మడివాళ సంఘం అధ్యక్షుడు ధనుంజయ హమాల్‌తో పాటు సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సిరుగుప్ప శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో ..

సిరుగుప్ప : పట్టణంలోని శిశు అభివృద్ధి యోజన భవనంలో తాలుకా పరిపాలన బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మడివాళ మాచిదేవ జయంతి నిర్వహించారు. మడివాళ మాచిదేవయ్య భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్ , డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, బసవ భూషణ స్వాములు, బసవరాజప్ప, మడివాళ మాచిదేవ గౌరవాధ్యక్షుడు గోవిందప్ప, యల్లప్ప, మాజీ అధ్యక్షులు పరమేష, న్యాయవాది సుంకప్ప, హళేకోట మల్లేశి, టెక్కుల కోట మల్లేశప్ప, ఈరణ్ణ, కృష్ణ పాల్గొన్నారు.



కంప్లి, : మడివాళ మాచిదేవ సమాజం శిక్షణకు ఎక్కువ ప్రాధాన్యం కల్పించి తమ పిల్లలకు విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. కంప్లి పట్టణంలో మడివాళ మాచయ్య జయంతి సందర్భంగా కార్యాలయంలో జయంతి నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షులు ఉలిగప్ప మాట్లాడుతూ తమ సమాజాన్ని ఎస్సీలో చేర్చాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను కల్పించాలన్నారు. అలాగే దోబీఘాట్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాజం అభినవ ప్రభుస్వాములు, మూకయ్యస్వామి, సమాజం ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంఘాలకు గుర్తింపు



వివిధ రంగాల్లో రాణించిన వారిని సన్మానిస్తున్న అంబేడ్కర్ పదాధికారులు

కంప్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఏ సంఘమైనా సరే ప్రజల్లో కలిసిపోయి సేవలు చేసినప్పుడే సంఘాలు గుర్తింపు పొందుతాయని అంబేడ్కర్ స్వాభిమానసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప తెలిపారు. పట్టణంలో భారతి శిశు విద్యాలయంలో శనివారం అంబేడ్కర్ స్వాభిమానసేన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో సంఘాలు ఏర్పడ్డాయి. ఆయా సంఘాల సేవలను బట్టే ప్రజలు గుర్తింపునిస్తారు. ఆ సంఘంతో పాటు అక్కడున్న అధ్యక్షులు, పదాధికారులు గుర్తింపు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు బట్టా ప్రసాద్, రాఘవేంద్ర, వీరేష్, శివలింగప్ప, భరత్, చిదానందప్ప, చెన్నప్ప, సుజాత, జిలాన్, కుమార్, సోమశేఖర్, హుస్సేనప్ప, ఖాజాగౌస్, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే అధికారులకు గుర్తింపు

● కుడితిని పట్టణ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్

కంప్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏ పోలీసు అధికారికైనా, సిబ్బందికైనా వారు చేపట్టిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని కుడితిని పట్టణ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ అన్నారు. కుడితినిలోని పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ ఎస్ఐగా పని చేస్తున్న విరుపాక్షి పదవీ విరమణ సందర్భంగా శనివారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఎన్ని ఘర్షణలు, గొడవలు పడ్డా సమస్యలు తలెత్తకుండా చేపట్టి గుర్తింపు పొందారన్నారు. డీఎస్పీ ప్రసాద్‌గోఖలే మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీసు శాఖ సిబ్బంది వారి స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలతో అన్యోన్యంగా వుంటూ సేవలు చేపట్టిన వారికి ఎప్పుడూ గుర్తింపు వుంటుందని తెలిపారు. వారితో పాటు సీఐ విశ్వనాథ్, శాంత కుమార్, దాకేష్, సుప్రీత్, కురుగోడు ఎస్ఐ వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజశేఖర్

హోసూరు జోన్

కలెక్టర్‌కు సీఎం అభినందనలు

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సెక్రటేరియట్‌లో కొత్తగా నియమితులైన 9 జిల్లాల అధికారులను సీఎం అభినందించారు. ఆర్.మది, ఎస్.శరవణన్, ఎం.ప్రతాప్, సి.దినేశ్‌కుమార్, ఎస్.అబ్దుల్‌రెహమాన్, కె.దర్పరాజ్, వి.మోహన్‌చంద్రన్, ,ఆర్.కుమార్, కే.శివసౌందరవల్లిలు నూతన కలెక్టర్‌లుగా నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రభుత్వ రంగ కార్యదర్శి రీటా హరీష్ తక్కర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. నూతన కలెక్టర్‌లను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్‌గా ఎంపికైన దినేశ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందచేసి అభినందించారు.



సీఎం స్టాలిన్‌తో కలెక్టర్ దినేశ్‌కుమార్

ట్రాఫిక్ సిగ్నల్స్ బాగు చేయండి

హోసూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని చోట్ల సక్రమంగా పనిచేయకపోవడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ నెలకొంటోంది. వెంటనే బాగు చేయాలని వాహనచోదకులు, ప్రయాణీకులు కోరుతున్నారు. అభివృద్ధి చెందుతున్న హోసూరు నగరంలో ట్రాఫిక్ రద్దీకి పోలీసులు కొరత కూడా మరో కారణంగా ఉంది. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కానీ అవి సజావుగా పనిచేయక పోవడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. పండుగ సీజన్ల తర్వాత ప్రభుత్వ సెలవు రోజుల్లో, ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ ఉంది.



పనిచేయని సిగ్నల్ లైట్లు

ఉత్సాహంగా సపలమ్మ జాతర

హోసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కెలవరపల్లి అనకట్ట సమీపానగల పురాతన సపలమ్మ దేవాలయంలోని అమ్మవారు పశువులను సంరక్షించే దేవతగా భక్తులు విశ్వసిస్తారు. ఆలయ ఉత్సవాలు జనవరి 27న ప్రారంభమైన ఉత్సవాలు వారం రోజుల పాటు కొనసాగుతుంది. పరుషలో చుట్టు పక్కల ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో పశువులను తెచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొంటారు. తమిళనాడుల్లోని వివిధ జిల్లాల నుంచి తక్కువ ఎత్తు ఉన్న పుంగనూరు, బర్గూరు, కాంగేయం, ఆలాంబాడి, ఉంబలచేరీ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన పశువులు రకాలు అమృతమహల్, హళ్ళికార్, కృష్ణవాలీ అనే రకాలు, ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పశువుల రకాలు ఒంగోలు, హావేరీ అనే రకాల పశువులు వచ్చాయి. కెలవరపల్లి చుట్టు ప్రాంతాల మహిళలు అమ్మవారికి చలిమిపిండి దీపాలు చేసి అమ్మవారికి మొక్కుకున్నారు. ప్రతిరోజూ అన్నదానం కొనసాగుతోంది. ఉత్సవ కమిటీ ద్వారా పశువులకు దాణాను ఉచితంగా సమకూర్చారు. ఒక్కో జత పశువు రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు విక్రయిస్తుంటారు.



పరుషలో హళ్ళికార్ జాతి ఎద్దులు

కల్యాణ కామాక్షి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు

హోసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు భారతీదాసన్‌నగర్‌లో కల్యాణ కామాక్షి అమ్మవారి ఆలయంలో నాట్యాంజలి, సుమంగళీలచే దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని నాట్యాంజలి బృందంతో కలిసి నాట్యం చేశారు. రెండు గంటల పాటు భరతనాట్యంలో పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులను నాట్య కళామణి, నాట్య జ్యోతి, నాట్యపుష్ప వంటి ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం తమిళులు తై మాసం మూడో శుక్రవారం రాత్రి పూజలు నిర్వహించారు. వంద మందికి పైగా మహిళలు పాల్గొని లోక కళ్యాణార్థం కోసం పూజలు నిర్వహించారు. కుంకుమ అర్చన చేసి దీపాన్ని వెలిగించి దీపాన్ని అమ్మవారి స్వరూపంగా భావించి పూజలు చేస్తారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంప్...

పంచాక్షర గవాయ్ (జయంతి)



పంచాక్షర గవాయ్ 1892 ఫిబ్రవరి 2న కర్ణాటక రాష్ట్రం గదగ్ జిల్లా హానగల్ తాలూకా కాడశెట్టిహళ్ళిలో జన్మించారు. అంధుడైనా సంగీతంలో, గాయనంలో రాణించారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన పేరిట కన్నడలో 'సంగీత సాగర గానయోగి పంచాక్షర గవాయ్' అనే సినిమా రూపొందించబడింది. హంసలేఖ సంగీతం ఆకట్టుకుంది. రాష్ట్ర, జాతీయస్థాయి పురస్కారాలు దక్కాయి. 1944 జూన్ 11న కన్నుమూశారు.

రహీం ఫహీముద్దీన్ దాగర్ (జయంతి)




'పద్మభూషణ్' రహీం ఫహీముద్దీన్ దాగర్ 1927 ఫిబ్రవరి 2న రాజస్థాన్ రాష్ట్రం ఆళ్వార్‌లో జన్మించారు. 'పద్మభూషణ్' ఉస్తాద్ అల్లాబండె రహీముద్దీన్ ఖాన్ దాగర్ కుమారుడు. శాస్త్రీయ సంగీతంలో రాణించి పేరొందారు. తనదైన ఆలాపనతో గుర్తింపు పొందారు. 12వ, 13వ శతాబ్దపునాటి రాగాలు సైతం ఆలపించి తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. యూఎస్ఏ, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ దేశాలలో సైతం కచేరీలు ప్రదర్శించారు. సంగీత్ రతన్, సంగీత నాటక అకాడమీ అవార్డు, కాళిదాస్ సమ్మాన్, జీవిత సాఫల్య పురస్కారం ఇతర అవార్డులు పొందారు. 2011 జూలై 27న కన్నుమూశారు.

బులుసు సాంబమూర్తి (వర్ధంతి)




గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బులుసు సాంబమూర్తి 1886 మార్చి 4న తూర్పు గోదావరి జిల్లా దుళ్ళ గ్రామంలో జన్మించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం, విశాలాంధ్ర అనే పరమలక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేశారు. గాంధీజీ పిలుపుతో న్యాయవాద వృత్తి వీడి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించారు. మద్రాస్ ప్రావిన్షియల్ అసెంబ్లీకి 1937 నుంచి 1942వరకు స్పీకర్‌గా పదవికి వన్నె తెచ్చారు. తన సర్వస్వాన్ని దేశోద్ధరణకు సమర్పించిన ఆయన చివరిరోజుల్లో పేదరికం, అనారోగ్యంతో గడిపి 1958 ఫిబ్రవరి 2న కన్నుమూశారు.

బెర్ట్రాండ్ రస్సెల్ (వర్ధంతి)



నోబెల్ పురస్కార గ్రహీత బెర్ట్రాండ్ ఆర్థర్ విలియమ్ రస్సెల్ 1872 మే 18న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. బ్రిటీష తత్వవేత్త, తార్కికుడు, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, సామ్యవాది, శాంతవాది, నాస్తికుడు. 'వై ఐ యామ్ నాట్ ఏ క్రిస్టియన్' పేరిట రాసిన గ్రంథం ఎంతోమంది నాస్తికులను ప్రభావితం చేసింది. లెక్చరర్‌గా గణిత శాస్త్రంలోనూ, తత్వ శాస్త్రంలోనూ రాణించారు. అణ్వస్త్రధారణ నిరసనోద్యమంలో పాల్గొని శాసనధిక్కారం చేసినందుకు 80వ యేట జైలుపాలయ్యారు. 1970 ఫిబ్రవరి 2న కన్నుమూశారు.

కె. విశ్వనాథ్ (వర్ధంతి)



పద్మశ్రీ గ్రహీత కాశీనాథుని విశ్వనాథ్ 1930 ఫిబ్రవరి 19న రేపల్లెలో జన్మించారు. తెలుగు సినిమా దర్శకుడుగా కళాతపస్వి బిరుదు పొందారు. ప్రశస్తమైన సినిమాలు సృష్టించి తెలుగు సినిమాకు గౌరవాన్ని, గుర్తింపు తెచ్చారు. ఆయన దర్శకత్వం వహించిన 'శంకరాభరణం' సినిమాకు జాతీయ పురస్కారం, సప్తపదికి జాతీయ సమగ్రత పురస్కారం దక్కాయి. స్వాతిముత్యం సినిమా 1986లో ఆస్కారు అవార్డుకు నామినేట్ అయ్యింది. సాంఘిక సమస్యలతోపాటు సంగీతానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. కెరీర్ చివరల్లో దర్శకత్వ బాధ్యతలు తగ్గించుకుని నటుడిగా ప్రేక్షకులను అలరించారు. రఘుపతి వెంకటయ్య, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. 2023 ఫిబ్రవరి 2న శివైక్యం చెందారు.

మధ్య తరగతి ప్రజలకు బంపర్ బడ్జెట్

- ప్రతిపక్షనేత అశోక్
- కేంద్రబడ్జెట్‌పై అభిప్రాయాలిలా

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ బంపర్ లాంటిదని ప్రతిపక్షనేత అశోక్ అభిప్రాయపడ్డారు. విధానసౌధలో శనివారం మీడియాతో మాట్లాడుతూ యూపీఏ పాలనలో అనవసరమైన ఖర్చులు, లూటీలతో ఎక్కువ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వారికి సాధ్యం కాలేదని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో దేశ ప్రజలకు కొత్తశక్తినిచ్చారన్నారు. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ 2013-14లో రూ.16.65 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని ప్రస్తుతం రూ.50.65 లక్షలకోట్లకు పెరిగిందన్నారు. ప్రణాళికేతర, పెట్టుబడులు, విద్య, వైద్యం వంటి పథకాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రూ.12లక్షలదాకా పన్ను రాయితీ వెసలుబాటు లభించిందన్నారు. దేశమంతటా కేన్సర్ బాధితులు పెరిగి చికిత్సలకోసం అప్పులపాలు అవుతున్నారని, జిల్లాకో కేన్సర్ ఆసుపత్రి ఎంతోమంది పేదలకు అనుకూలం కానుందన్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా రైతులకు లభించే రుణం రూ.3 నుంచి రూ.5లక్షలకు పెరిగిందని, స్టార్టప్ కంపెనీలకు 10-20 కోట్లకు తక్కువ వడ్డీతో రుణం లభించనుందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.5లక్షల దాకా టర్మ్‌లోన్ అనుకూలం కానుందన్నారు. సీఎం సిద్దరామయ్య రాష్ట్రంలో పీల్చే గాలి మినహా అన్నింటికీ పన్ను వేశారని, కేంద్రంలో మోదీ ప్రభుత్వం పన్నులు పెంచలేదన్నారు. సిద్దరామయ్య తరహాలో సంతలో మాట్లాడే భాష ఎవరూ విశ్వసించరన్నారు.

పిల్లల పోషణ, విద్యకు ప్రాధాన్యం - అక్షయపాత్ర సీఈఓ

కేంద్ర బడ్జెట్‌లో పిల్లల పోషణ, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని అక్షయపాత్ర ఫౌండేషన్ సీఈఓ శ్రీధర్ వెంకట్ అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీ, పోషణ్ 2.0 పథకాలు సుస్థిర ప్రగతికి, ఆకలిలేని సమాజం సృష్టించేందుకు దోహదపడిందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ స్థాపనతో ఆహార సంస్కరణ ప్రక్రియలు సులభతరం కానున్నాయన్నారు. కేంద్రబడ్జెట్‌ను సాదరంగా స్వాగతిస్తున్నామన్నారు.

పాఠశాలల్లో ల్యాబ్‌లు మంచి ఆలోచన : రియాన్ ఎడ్యుకేషన్ సీఓఓ వినోద్‌శర్మ

ప్రభుత్వ పాఠశాలల్లో 50వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు ద్వారా విద్యార్థులలో సాంకేతిక పరిశోధనల పట్ల ఆసక్తి పెరిగేందుకు కారణం కానుందన్నారు. మెడికల్ సీట్లు పెంచే ఆలోచన కూడా శుభ పరిణామమని రియాన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సీఓఓ వినోద్‌శర్మ అభిప్రాయపడ్డారు. ఏఐ టెక్నాలజీ నైపుణ్యత కేంద్రాలకు రూ.500 కోట్లు కేటాయించడం స్వాగతార్హమన్నారు. వెయ్యి ఐటిఐలు ఉన్నతీకరణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు సమకూరనున్నాయన్నారు.

ఉత్పాదన రంగానికి చేయూత : అర్జున్‌రంగా

ఉత్పాదనా రంగానికి కేంద్రబడ్జెట్‌లో చేయూత ఇచ్చారని మేక్ ఇన్ ఇండియా ప్రాధాన్యత పెరగనుందని సైకిల్‌ప్యూర్ అగర్బత్తీ ఎండీ అర్జున్‌రంగా అభిప్రాయపడ్డారు. సోలార్, మొబైల్, ఎలక్ట్రికల్ వాహనాలు, బ్యాటరీలు, విండ్ టర్బైన్‌లు ధరలు తగ్గించి ఇంధనవాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు.

చర్మ ఉత్పత్తులకు సహకారం : సీఐఎఫ్ఐ చైర్మన్ నౌషాద్

ఫోకస్ ప్రోడక్ట్ స్కీమ్‌ను దేశీయ ఫుట్‌వేర్ పరిశ్రమల కూటమి స్వాగతిస్తోందని సీఐఎఫ్ఐ చైర్మన్, వాకరూ సంస్థ ఎండీ నౌషాద్ అభిప్రాయపడ్డారు. ఈ పథకం ద్వారా 22లక్షలమందికి ఉద్యోగాలు, 4 లక్షల కోట్ల లావాదేవీలు 1.18 లక్షల కోట్ల ఎగుమతులు సాధ్యం కానున్నాయన్నారు. దేశీయ చర్మ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇచ్చినట్టయ్యిందన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ద్వారా యువత స్వావలంబన, బీఎఫ్ఎస్ఐ రంగంలో ఆధునాతన విధానాలు సాధ్యం కానున్నాయని మణిపాల్ అకాడమీ ఆఫ్ బిజినెస్ హెడ్ అధాశిశా అభిప్రాయపడ్డారు. బీమారంగంలో ఎఫ్‌డిఐను వందశాతానికి పెంచే నిర్ణయం స్వాగతమన్నారు. ప్రస్తుతం దేశానికి పరిశ్రమలకు అవసరమయ్యే మానవవనరులను సమకూర్చే విధానం కీలకమన్నారు.

విద్యాసంస్థలకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం - హర్షం తెలిపిన పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామి



చాన్స్‌లర్ దొరస్వామి

విద్యాసంస్థల ప్రగతికోసం కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం సంతోషించే విషయమని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. ఈమేరకు బడ్జెట్‌పై శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 78లక్షల కోట్లు పాఠశాల విద్యకు ప్రోత్సహించడాన్ని హర్షం తెలిపారు. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కోసం 15వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించేందుకు రూ.1450 కోట్లు, ప్రధానమంత్రి పోషణ్‌శక్తి కోసం రూ.12,500 కోట్లు కేటాయింపు సమంజసమన్నారు. ప్రాథమికదశలో విద్యార్థులు చదువుకునే వాతావరణంతోపాటు పౌష్టికాహారం కీలకమైనదన్నారు. 50వేల అటల్ టింకరింగ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ల్యాండ్‌స్కేప్‌పై ప్రభుత్వం ప్రత్యేకచొరవ చూపిందన్నారు. యువ గ్రాడ్యుయేట్‌లకు వృత్తి నైపుణ్యత, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆర్థిక సంవత్సరంలో 10వేలు, ఐదేళ్ల వ్యవధిలో 75వేల మెడికల్ సీట్లు పెంచాలనే నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా మరింతమంది యువవైద్యులకు ప్రోత్సహించినట్టు ఉందన్నారు.

ఉన్నత విద్య, పరిశోధనలకు మరింతశక్తి - రేవా చాన్స్‌లర్ పి శ్యామరాజు



చాన్స్‌లర్ పి శ్యామరాజు

ఉన్నత విద్య, పరిశోధనా రంగాలకు కేంద్ర బడ్జెట్ మరింత శక్తినిచ్చిందని రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు అభిప్రా య పడ్డారు. ఉన్నత విద్యకోసం కేంద్ర బడ్జెట్‌లో 7.74శాతం పెంచడం సంతోషమన్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థకు కేటాయించిన నిధి గమనార్హమని, ఎక్కువసంస్థల ద్వారా గుణాత్మక విద్య పరిశోధనలు వంటి దూరదృష్టిని ప్రతిబింబి చిందన్నారు. 22 భారతీయ భాష ల్లో పాఠ్యపుస్తకాలు అభివృద్ధి చేసే యూజీసీ విధానాన్ని కొనియాడారు. మౌలిక సదుపాయాలు బలోపేతం, ఆధునిక సాంకేతికతను పెంపొందింప చేసి విద్యార్థులలో జ్ఞానం, నైపుణ్యత అభివృద్ధి చేసే పరివర్తనాత్మక చర్యలను స్వాగతిస్తున్నామన్నారు. పలువురు ప్రముఖులు కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

బేంద్రె సాహిత్యంలో సందేశం



వివిధరంగాల సాధకులకు సన్మానం

బంగారపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో మార్పు తెచ్చేలాంటి సందేశాలు వరకవిగా పేరొందిన డాక్టర్ ద.రా.బేంద్రె రచించిన ప్రతి సాహిత్యంలోనూ, కవితల్లోనూ ఒక్కో సందేశం ఉందని కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు అశ్వథ్ అభిప్రాయపడ్డారు. బంగారపేట పట్టణంలోని నవచేతన విద్యాసంస్థ కళాశాలలో ఏర్పాటైన డాక్టర్ ద.రా.బేంద్రె 129వ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భాషా పదసంపద, నాద సంపద ఆయన సొంతమన్నారు. ఆయన కవిత్వం, సాహిత్యం ఉన్నతంగా ఉండి పాఠకుల మనస్సు ఆకట్టుకుంటుందన్నారు. ప్రత్యేకించి 1973లో 'నాకు తంతి' రచన ఎంతో పేరొందిందని, అత్యున్నత జ్ఞానపీఠ పురస్కారంతోపాటు పద్మశ్రీ అందుకున్నారన్నారు. ప్రజల కష్టసుఖాలతోపాటు ప్రకృతి, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలు కూడా ఆయన రచనల్లో ఉంటాయన్నారు. నవచేతన విద్యాసంస్థ కార్యదర్శి ఎల్ రామకృష్ణప్ప మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించి పాఠ్యపుస్తకాలపై దృష్టి సారించి చదవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాహిత్యాభిలాష పెంచుకుని రచనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి అప్పయ్యగౌడ, నవచేతన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, సాహితీవేత్తలు వైఎస్ కృష్ణమూర్తి, సతీశ్ కుమార్, హైస్కూల్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఆయేషాబేగం, ఉపాధ్యాయులు మంజునాథ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక నిష్పక్షపాతంగా జరగాలి

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలని బీజేపీ ముఖ్యుడు సీకల్ రామ చంద్ర గౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర జిల్లా బీజేపీ అధ్యక్షుల ఎంపిక అందరినీ విశ్వాసంలోకి తీసుకోవాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం అందరినీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తాను కూడా జిల్లా అధ్యక్షస్థానం రేసులో ఉన్నానని, అయితే అందరి అభిప్రాయాలను పరిగణించాలని కోరారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. సమావేశంలో రూరల్ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, మాజీ అధ్యక్షుడు కంబదహళ్ళి సురేంద్రగౌడ, నగరసభ సభ్యుడు, బీజేపీ నాయకుడు నారాయణస్వామి, కనకప్రసాద్, పురుషోత్తమ్, మధు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో సీకల్ రామచంద్రగౌడ తదితరులు

ప్రజలను చైతన్య పరిచిన మడివాళ మాచిదేవ

బాగేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శతాబ్దాలక్రితమే సమాజంలోని సామాజిక అసమానతలపై ప్రజలను చైతన్యం తెచ్చిన మడివాళ మాచిదేవ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో శనివారం మడివాళ మాచిదేవ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పన్నెండో శతాబ్దంలో అందరికీ సమానత్వం, న్యాయం అందించడానికి సామాజిక విప్లవం చేపట్టారన్నారు. ఈ ప్రాంతంలో విద్య అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అగస, సవితా కు లాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వదృష్టికి తెస్తున్నామన్నారు. ఇదే సందర్భంగా మడివాళ మాచిదేవ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మనిషా మహేశ్ ఎస్ పత్రి, మడివాళ సామాజికవర్గ ప్రముఖుడు హెచ్‌వి నాగరాజు, సంఘం అధ్యక్షుడు సురేశ్, క్రికెట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మడివాళ మాచిదేవ జయంతిలో ఎమ్మెల్యే తదితరులు

ఓపీఎస్ అమలుకై డిమాండ్



తహసీల్దారుకు వినతిపత్రం అందజేత

బెంగళూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) మళ్లీ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేస్తూ తాలూకా కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ప్రవాసి మందిరం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా సాగారు. అనంతరం తహసీల్దారు సుదర్శన్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఈనెల 7న నిరవధిక ధర్నా చేపట్టదలిచామని అందుకు ప్రభుత్వ ఉద్యోగులు అందరూ సహకరించాలని కోరారు. 2006 తర్వాత ఎంపికైన ప్రభుత్వ ఉద్యోగులు రిటైరైన తర్వాత అతి తక్కువ పింఛను వస్తుందని దీంతో జీవన నిర్వహణ కష్టంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పాతపింఛను వ్యవస్థ మళ్లీ అమలు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్టు తెలిపారు. నిరసనలో ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు గోకుల్, కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి శైలజా తదితరులు పాల్గొన్నారు.

ధర లేక పొలంలోనే కొత్తిమీర

ముళబాగిలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్ని కూరల్లో వినియోగించే కొత్తిమీరకు ప్రస్తుతం ధర లేకపోవడంతో నష్టపోతున్నట్టు పలువురు రైతులు వాపోయారు. ఒక ఎకరా కొత్తిమీర పండించాలంటే 40వేల రూపాయలు ఖర్చు అవుతుందని, నాలుగు నెలలుగా కొత్తిమీర కట్ట కేవలం రూపాయి మాత్రమే పలుకుతుండడంతో నష్టపోతున్నామని పాలూరుకు చెందిన రైతు రంగనాథ్ విచారం వ్యక్తం చేశారు. ఇదివరకు 45రోజులకు కోతకు వచ్చేదని, ప్రస్తుతం హైబ్రీడ్‌రకం 30రోజులకే వస్తోందన్నారు. దీంతో పలువురు రైతులు కొత్తిమీర సాగువైపు ఆసక్తి చూపడంతో డిమాండ్ తగ్గిందన్నారు. ఇదివరకు కొత్తమీరను సమీపంలోని తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారమని ఐదారు నెలలుగా డిమాండ్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు ఎగుమతి సాధ్యం కావడం లేదన్నారు. కోలారు జిల్లాలో 10వేలకుపైగా ఎకరాలలో పండిస్తుండడంతో ధర తగ్గిందని మరో రైతు అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో కొత్తిమీర పంటను పశువులకు ఆహారంలా వదిలేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

ఇరానీగ్యాంగ్ సభ్యుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగలతో నిందితుడు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఐడీ పోలీసులమని చెప్పుకొంటూ మహిళలను నమ్మించి బంగారు ఆభరణాల దోపిడీకి పాల్పడుతున్న ఇరాని గ్యాంగ్‌కు చెందిన కీలక సభ్యుడిని తాలూకా రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడినుంచి లక్షలాదిరూపాయల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు స్వగ్రామం మహారాష్ట్ర రాష్ట్రం ఠానె జిల్లా శాంతినగరలోని బివండి ప్రాంత నివాసి సాదుల్లా జపారిగా గుర్తించారు. ఇటీవల కొంతకాలంగా సరిహద్దులోని అనంతపురం జిల్లా గుంతకల్లులో ఉంటున్నాడని పోలీసులు తెలిపారు. శిడ్లఘట్ట తాలూకాలోని గంగానగర్‌లో ఉంటున్న ఒక మహిళను తాను సీఐడీ పోలీసునని పరిచయం చేసుకుని మెడలోని నగలను భద్రంగా ఉంచుకోవాలని సూచించి అనంతరం ఆమెను ఏమార్చి నగతో ఉండాయించాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లా ఎస్పీ కుశల్‌చౌక్సీ నేతృత్వంలో చేపట్టిన కార్యాచరణలో నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఇతడికి సహకరిస్తున్న వారికోసం గాలింపులు చేపట్టామన్నారు.

బలిజ కండ్రిగ సర్వీసు వేళల్లో మార్పు

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బలిజకండ్రిగకు నగరంలోని చిక్కమారనహళ్ళి (బీఈఎల్ రోడ్డు దేవసంద్ర)నుంచి కేఎస్‌ఆర్టీసీ సేవలలో సమయం మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలోని బలిజ కండ్రిగతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు అను కూలంగా ఉండాలనే కేఎస్‌ఆర్టీసీ సేవలు విస్తరింపచేశారు. చిక్కమారనహళ్ళిలో ఉదయం 7.30గంటలకు బయల్దేరే బస్సు మధ్యాహ్నం 3 గంటలకు బలిజకండ్రిగలో వెనుతిరగనుంది. ఈమేరకు స్థానికులు డిపో మేనేజర్ నేత్ర, కేఎస్‌ఆర్టీసీ సిబ్బం దిని ప్రత్యేకంగా సత్కరించారు.



ఆర్టీసీ సిబ్బందిని సత్కరిస్తున్న స్థానికులు

ఉత్సాహంగా జల్లికట్టు



పోట్లగిత్తల్ని నియంత్రిస్తున్న యువకులు

చెన్నై, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా మాతాకోటలో లూర్దు మాతా జల్లికట్టు పేరవై ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. తంజావూరు ఎమ్మెల్యే నీలమేఘం, రెవెన్యూ తహసీల్దార్ ఇలక్కియ యువకుల చేత ప్రతిజ్ఞ చేయించి పోటీలు ప్రారంభించారు. అనంతరం వాడివాసల్ నుంచి తంజావూరు, పుదుకోట, తిరుచ్చి, మదురై, అరియలూరు, పెరంబలూరు జిల్లాలకు చెందిన 657 పోట్ల గిత్తలు ఒకదాని తర్వాత ఒకటి రంకెలేస్తూ బయటకు వచ్చాయి. ఎద్దులను అదుపు చేసేందుకు 358 మంది యువకులు బరిలో నిలిచారు. మొత్తం ఐదు రౌండ్లుగా పోటీ జరిగింది. ఎద్దులు అదుపుచేసే సమయంలో యువకులు గాయాలు కాకుండా వాడివాసల్ నుంచి సుమారు 100 మీటర్ల వరకు అరటి నారను వేశారు. ఎద్దులు అదుపుచేసిన యువకులకు సైకిళ్లు, డైనింగ్ టేబుల్, సిల్వర్ అండా సహా పలు వస్తువులు అందించారు. అలాగే, యువకులకు చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు కూడా బహుమతులు అందజేశారు. తొలుత క్రీడాకారులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, అర్హత కలిగిన వారిని మాత్రమే పోటీలకు అనుమతించారు. అలాగే, ఎద్దులను కూడా వెటర్నరీ వైద్యులు పరీక్షించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వాటిని మాత్రమే పోటీలకు అనుమతించారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 400 మంది పోలీసులు విధులు చేపట్టారు.

కోటెకారు బ్యాంకు దోపిడీ దొంగ తప్పించుకునేయత్నం


- కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్న పోలీసులు

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా మంగళూరుకు అనుబంధమైన ఉళ్ళాలలోని కోటెకారు బ్యాంకు దోపిడీ కేసు నిందితులను పంచనామాకోసం తీసుకొచ్చిన వేళ తప్పించుకునే ప్రయత్నం చేయగా కాల్పులు జరిపి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం పంచనామా కోసం నిందితులు మురుగండి థేవర్, యెశువా రాజేంద్రన్‌లను తీసుకొచ్చారు. నిందితుడు ఉపయోగించిన పిస్టల్‌ను దాచిన ప్రదేశానికి తీసుకెళ్లారు. రికవరీ కోసం తీసుకెళ్లిన సమయంలో కానిస్టేబుల్ మంజునాథ్‌పై దాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేయగా కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా మురుగన్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఉళ్ళాల ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కాలిపై ఫైరింగ్ చేశాడు. గాయాలపాలైన నిందితుడిని దేరళకట్టెలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.



పంచనామా ప్రదేశంలో పోలీసులు

35 ఆరా విజన్ గ్లాస్‌లు విరాళం



ఆరావిజన్ గ్లాస్‌ల పంపిణీలో దాల్మియా కుటుంబీకులు

బెంగళూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో కంటి చూపు మందగించినవారికి ఆరా గ్లాస్ డివైజ్ ఎంతో ఉపకరించనుందని నారాయణ నేత్రాలయ సీఈఓ ఎస్‌కే మిత్తల్ అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారకుటుంబానికి చెందిన దాల్మియా 35 మందికి అవసరమైన ఆరా విజన్ గ్లాస్‌లను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మిత్తల్ మాట్లాడుతూ కంటిచూపు మందగించిన వారికి డివైజ్‌లాంటి కళ్లజోడు కొత్త వెలుగును ఇవ్వనుందన్నారు. కంప్యూటర్ తరహాలో పనిచేయనుందన్నారు. ఒక్కో ఆరా గ్లాస్ విలువ లక్ష రూపాయలకుపైగా ఉంటుందన్నారు. ఎస్‌హెచ్‌జి టెక్నాలజీ సీఈఓ సీతారాం ముక్తంగి, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ భానుమతి డాక్టర్ సునితాతోపాటు పలువురు పాల్గొన్నారు. 8మందికి ఆరా గ్లాస్‌లను పంపిణీ చేశారు. దాల్మియా మాట్లాడుతూ ఇటీవలే నారాయణ నేత్రాలయలో సౌకర్యాలు చూసేందుకు వెళ్లానని, కంటి సంరక్షణలో ఆధునాతనమైన పరిజ్ఞానంతో సేవలందిస్తోందన్నారు. ఆరా గ్లాస్‌ల గురించి వివరాలు తెలుసుకుని అవసరమైనవారికి అందించేందుకు తమవంతు సాయం చేశామన్నారు.

దివ్యమైన మనసుతో ఆరాధించడమే భక్తి

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివ్యమైన మనసుతో భగవంతుడిని ఆరాధించడమే భక్తిమార్గమని శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి పేర్కొన్నారు. స్థానిక రాయపేటలో ప్రసిద్ధిచెందిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం వచ్చే సోమవారం నిర్వహించనున్న సందర్భంగా ఆలయప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన యాగశాలలో సాయంత్రం 6గంటలకు మంగళశాసనం, యజమాన అనుజ్ఞ, నిత్యహోమం, పుణ్యాహవచనం, పూర్ణాహుతి, అంకురార్పణం, యాగపూజలను చిన్న జీయర్‌స్వామి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆలయ జీర్ణోద్ధారణ పనులను విజయవంతంగా పూర్తిచేసి, మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు సిద్ధం చేసిన దేవస్థానం నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ.. 1996లో ఈ ఆలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకంలో పాల్గొన్న తాను ప్రస్తుతం తృతీయ మహాకుంభాభిషేక పూజలను ప్రారంభించడం భగవంతుడి దయగా అభివర్ణించారు.

న్యూస్ బాక్స్

నేడు 'అనంతపురం కోసం పరుగు'

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సే నో టూ డ్రగ్స్ నినాదంతో అనంతపురం కోసం పరుగు కార్యక్రమాన్ని శాప్, ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్తంగా ఆదివారం వీ రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శాప్-ఈగల్ సే నో టూ డ్రగ్స్ పోస్టర్లను సభ్యులు విడుదల చేశారు. వీ వైబ్ సంస్థ అధినేత సజ్జ రాఘవీణ, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ సుధాకర్, ఎస్‌వీ యూనివర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ మాట్లాడుతూ శాప్, ఎలైట్ యాంటీనార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎంపవర్‌మెంట్-ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో వీ వైబ్ సంస్థ నిర్వహించే అనంతపురం కోసం పరుగు (వీ రన్ ఫర్ అనంతపురం) సే నో టూ డ్రగ్స్ అనే నినాదంతో కొనసాగుతుందన్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు కలెక్టరేట్ నుంచి 10కె, 5కె, 3కె రన్ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీ నగేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పాల్గొంటారన్నారు.

'అశోక్ పడపాటి'కి అవార్డు


అశోక్ పడపాటిని సత్కరిస్తున్న ప్రతినిధులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వదాన్య జన సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు విద్యపరంగా సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ ఫౌండర్ అశోక్ పడపాటికి యువత భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం బెంగళూరులోని గోవిందాచార్య స్థాపించిన భారత వికాస సంఘం 7వ భారతీయ సంస్కృతి ఉత్సవాలలో వివిధ సామాజిక సేవా రంగాల్లో ప్రతిభ చాటిన సామాజికసేవా కార్యకర్తలకు సత్కరించారు. అందులో భాగంగా అశోక్ పడపాటికి అవార్డును అందజేసి సత్కరించారు. ప్రధాన సమన్వయకర్త బసవరాజ్ పాటిల్, మాజీ ఎంపీ, రిటైర్డ్ మేజర్ జనరల్ ప్రమోద్ సెహగల్, వందేమాతరం ఫౌండేషన్ మాధవ్ రెడ్డి, సీజీఆర్ అధిపతి లీలా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నైతిక, మానవతా విలువల పరీక్షకు 799 గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 146 జూనియర్ కళాశాల్లో శనివారం నిర్వహించిన నైతిక, మానవతా విలువల పరీక్షకు 799 గైర్హాజరైనట్లు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి(డీవీఈఓ), జిల్లాపరీక్షల నిర్వహణ కన్వీనర్ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. 26274 మందికిగాను 25475 మంది విద్యార్థులు హాజరుకాగా 799 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారు..?

రాష్ట్రానికి మేలే జరిగింది..



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మేలే జరిగింది. అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగవర్గాలకు పన్ను మినహాయింపుతో ప్రయోజనం చేకూరింది. పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభపరిణామం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాల పరిమితి పెంపుతో ఆ వర్గాలకు ప్రయోజనం చేకూరింది. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పెద్దల చొరవతో రాష్ట్రానికి మేలే జరిగింది.

- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ప్రగతిశీల బడ్జెట్...



ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రగతిశీల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపునిచ్చారు. పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయం తదితర రంగాలకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. ఎంబీబీఎస్ సీట్లను పెంచి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రాధాన్యమించారు.

- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నాయకులు.

పేదలకు ప్రయోజనం లేని బడ్జెట్



పెట్టుబడిదారులకు అందలమెక్కించే విధంగా బడ్జెట్ ఉంది. ప్రధాని మోదీ మాటల గారడీ, ఆర్థికమంత్రి అంకెల గారడీతో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు. కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూల బడ్జెట్ ఇది. పేదలకు ఏ మాత్రం ప్రయోజనం చేకూరదు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతాంగ ఆశలన్నీ ఈ బడ్జెట్‌తో ఆవిరయ్యాయి. ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయించకపోవడం, ప్రధానమంత్రి ఫసల్‌బీమాకు నిధుల్లో కోత పెట్టడం, రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ నిధులు ప్రస్తావించకపోవడం దారుణం.

-దాదాగాంధీ, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులను ప్రోత్సహించేలా...



సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు సృష్టించి వాటిని స్టార్టప్ రూపంలో సమాజ అవసరాలను తీర్చేలా రూపొందించిన కేంద్ర బడ్జెట్ విద్యార్థులను ప్రోత్సహించేవిధంగా ప్రాధాన్యమిచ్చారు. ఇప్పటికే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన విద్యావిధానంలో పాఠ్యాంశాలను రూపొందించాం. వాటిని ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడానికి ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తున్నాం. పరిశ్రమల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించిన అంశం కలసివస్తుంది.

- రామచంద్ర, ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు



గ్రామీణాభివృద్ధికి తోడ్పాటునందించేలా వ్యవసాయ రంగం, దాని అనుబంధ సంస్థలకు రూ.1.72 లక్షల కోట్లు కేటాయించారు. అధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు, కిసాన్ క్రెడిట్ కార్డ్సు పంపిణీ చేసేందుకు నిధులు కేటాయించారు. వేరుశనగ, నువ్వులు, ఆమిదాలు వంటి నూనెగింజల పంటలను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో చోటుకల్పించారు. చేపలు, రొయ్యలు విదేశీలకు ఎగుమతికి. పాడిపరిశ్రమ, కోళ్ల, గొర్రెల ఫార్మింగ్‌కు ఇవన్నీ గ్రామీణాభివృద్ధికి దోహదపడుతాయి. అనంతపురం జిల్లాభివృద్ధికి చోటుకల్పిండం విశేషం.

-ప్రొఫెసర్ మునినారాయణప్ప, ఎస్కేయూ రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి

రైతులు నష్టపోకుండా చూస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలోని రైతులు నష్టపోకుండా చూస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం మండలంలోని రాచానపల్లి గ్రామం వద్దనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కందులు కొనుగోలు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం ఎకరాకు 2.5 క్వింటాళ్ల కందులు మాత్రమే కొనుగోలు చేస్తోందని, దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఎకరాకు ఐదు క్వింటాళ్ల వరకు కందులు కొనుగోలు చేయాలని, ఆమేరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి ఫోన్ ద్వారా రైతులు విజ్ఞప్తులను తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రఘు, పాముదాయి వెంకటేష్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, క్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, కొండయ్య, సర్దానప్ప, అల్లీపీర, నాగరాజు. ఎర్రిస్వామి, బుల్లెట్ రఫీ, బొజ్జయ్య. గోపాల్, రవి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష విభాగాన్ని అవినీతి మయం చేశారు

గత ప్రభుత్వంలో సమగ్ర శిక్ష విభాగాన్ని అవినీతి మయం చేశారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష విభాగం అధికారులతో ఆమె సమావేశమయ్యారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో సమగ్ర శిక్ష పాఠశాలల్లో జరుగుతున్న పనులు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత తదితర అంశాలపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పేరూరు ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల మరమ్మతులకు రూ.44 లక్షలు, నసనకోటలో రూ.25 లక్షలతో పనులు చేపట్టాలన్నారు.

అర్హులైన వారందరికీ పింఛన్లు

రామగిరి అర్హులైన వారందరికీ పింఛన్లు అందుతాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని నసనకోట పంచాయతీ ముత్యాలంపల్లి గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉదయాన్నే ఆమె గ్రామానికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంసీ పల్లి మాజీ సర్పంచ్ ముత్యాలప్ప, నాయకులు మారెన్న, సత్యనారాయణ, వడ్డివెంకటేశ్ పాల్గొన్నారు.

లఘుచిత్రోత్సవ్‌కు 86 చిత్రాల ఎంపిక

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ లఘుచిత్రోత్సవ పోటీలకు 18 విభాగాల్లో 86 లఘుచిత్రాలను ఎంపిక చేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు రఫీద్‌బాషా తెలిపారు. శనివారం నగరంలోని విద్యుత్ కళావేదికలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి పోటీదారులు పంపారన్నారు. వాటన్నింటినీ జనవరి 28, 29వ తేదీల్లో విద్యుత్ కళావేదిక ప్రివ్యూ థియేటర్‌లో తనతోపాటు హైదరాబాద్‌కు చెందిన డైరెక్టర్ వెంకట్ కట్టా, విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు పరిశీలించి మొత్తం 18 విభాగాల్లో 86 లఘుచిత్రాలను పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సొసైటీ సభ్యులు తోట బాలన్న, యాంకర్ రమేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో పలు కాలనీల్లోని పేదల నుంచి ఇళ్ల పట్టాల కోసం దరకాస్తులు స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. జాఫర్ మాట్లాడుతూ కొందరు పట్టాల పేరుతో దందా చేస్తున్నారన్నారు. ప్రజలు ఎవరి మాటలు నమ్మవద్దని, సీపీఐతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్లలో ఇచ్చిన స్థలాలను మార్పు చేసి 3 సెంట్లు, 2 సెంట్లుగా మళ్లీ పేదలకు ఇవ్వాలని కోరారు. రమణయ్య,అల్లిపీరా, సంతోష్ కుమార్, ఖాజా హుస్సేన్, చాంద్‌బాషా, నాగప్ప, మురళి పాల్గొన్నారు.

జువైనల్ అధికారులకు అవగాహన

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన జువైనల్ అధికారులకు అవగాహన కల్పించారు. న్యాయసేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన సదస్సుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. జువైనల్ జస్టిస్ యాక్ట్, అరెస్ట్, రిమాండ్ విషయాల్లో వ్యవహరించాలనే విషయంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఐటికె నల్లప్ప, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల జువైనల్ అధికారులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు వ్యాఖ్యలు అన్యాయం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీపై సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వాఖ్యలు అన్యాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వాపోయారు. సుప్రీం కోర్టు వాఖ్యలకు నిరసనగా శనివారం అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన ఆందోళనలో సాకేహరి మాట్లాడారు. కులవివక్షను రూపుమాపేలా దశాబ్దాల తరబడి పోరాటాలుచేసిన ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. సుప్రీం వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రజాసామ్యవాదులు తరలి రావాలని విజ్ఞప్తిచేశారు. రామకృష్ణ, రాజు, ఆది, వెంకటేసులు, నారాయణస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరు ప్రాథమికోన్నత పాఠశాలను తొలిగించకుండా జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంఈఓ నవీదాకు ఆ గ్రామ ప్రజలు విన్నవించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 117 జీవో ఆధారంగా జంతులూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తొలిగించడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతాయన్నారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులకు పైగా చదువుతున్నారన్నారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తే జంతులూరు, నీలంపల్లి, చెదల్ల, గోవిందంపల్లి, భద్రంపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని, 120 మందిపైగా పాఠశాలకు వస్తారని ప్రజలు ఎంఈఓకు విన్నవించారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్ అందజేత

రాప్తాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు గ్రామానికి చెందిన మోకే వీరభద్ర కొంత కాలంగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో వీరభద్రకు నూతన పింఛన్ రూ.10 వేలు మంజూరు అయ్యింది. ఆమేరకు టీడీపీ నాయకులు శనివారం వీరభద్ర ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్మును అందచేశారు. మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కదిరిలో ఉన్న తనకల్లు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రామానాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో చదివిన బాలికలు 3వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మార్చి 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు కదిరిలోని గిరిజన బాలికల పాఠశాల, అనంత జిల్లాలోని గొల్లలదొడ్డి గిరిజన బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. విద్యార్థినులు //http://twreiscet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ


డీజీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను ఎస్పీ జగదీష్ కలిశారు. శనివారం మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీజీపీని కలిసి మొక్కను అందజేశారు. నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన చెస్ జిల్లా క్రీడాకారులు ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా శనివారం విడుదల చేసిన చెస్ క్రీడాకారుల జాబితాలో మెరుగైన స్థానాలను సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి సంజయ్‌సాహుల్ 1401 ర్యాంకులో నిలవగా, త్రిపద 1427 ర్యాంకును దక్కించుకున్నారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు క్రీడాకారులను అభినందించారు.

ఖజానాశాఖ ఇన్‌చార్జి డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానాశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న సరళా విజయకుమారి శుక్రవారం పదవీవిరమణ పొందిన విషయం తెలిసిందే. కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వెంకటేశ్వర్లు శనివారం జిల్లాకు వచ్చి ఖజానాశాఖ ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు, ఉద్యోగులు డీడీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అలుపెరగని పోరాటయోధుడు మందకృష్ణ మాదిగ

గార్లదిన్నె, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాదిగల ఉనికి చాటేందుకు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటలు చేశారని ఎమార్పీఎస్ నాయకుడు కదిరప్ప అన్నారు. మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో శనివారం ఎమ్మార్పీఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు గార్లదిన్నెలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కదిరప్ప, మిట్టా రాజా, రాజుకుళ్యాయ్యప్ప, నాగరాజు, పుల్లన్న, ప్రసాద్, ఆదేన్న, బాలరాజు, తిక్కన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎరువులు నాణ్యతగా ఉండాలి

శింగనమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎరువులు నాణ్యతగా ఉండాలని జిల్లా వ్యవసాయధికారి ఉమామహేశ్వరమ్మ ఎరువుల తయారీదారులను ఆదేశించారు. శనివారం మండలంలోని సి.బండమీదపల్లి స్వర్ణ భూమి ఫర్టిలైజర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని లైసెన్స్ రామెటీరియల్ రిజిస్టర్, ల్యాబ్, మిషనరీ గోడౌన్‌ని పరిశీలించారు. అమె మాట్లాడుతూ ఎరువుల తయారీకి సంబంధించి ప్రతి నెల స్టాక్ రిపోర్ట్ తప్పకుండా ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఏఓలు అన్వేష్ కూమార్, బాలా నాయక్ పాల్గొన్నారు.

ఉపాధిని కోల్పోతున్నాం.. ఆదుకోండి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో తమకు ఉపాధి మార్గమైన దుకాణాలతో పాటు నివాసాలు కోల్పోతున్నామని, ఆదుకోవాలని మండలంలోని ఎన్‌ఎస్‌గేటు గ్రామస్థులు శనివారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రధాన కూడలిలో దుకాణాలను ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. రైల్వే వంతెన నిర్మాణం చేపడుతుండటంతో 10 రోజుల్లో దుకాణాలతో పాటు నివాసాలు ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ 15రోజుల పాటు సమయం తీసుకుని దుకాణాలను తొలగించుకోవాలన్నారు.

ఐటీఐ టెక్ కార్నర్ ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ టెక్ కార్నర్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌గా ఆధునిక టెక్నాలజీ విద్యనందించేందుకు రూ.40లక్షల వ్యయంతో అధునాత కేంద్రాన్ని చేశామ్నారు. అధ్యాపకులు ఇషాక్‌బాషా, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

7న చలో హైదరాబాద్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 7వ తేదీన చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. శనివారం ఉపాధ్యాయభవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో "వేల గొంతులు- లక్షల డప్పులు" కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. గంగాధర్, అమర్‌నాథ్, కదిరప్ప, చంద్ర, నాగభూషణం, రమేష్, శీనా, బూదెప్ప పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన ఏపీ, తమిళనాడు జట్లు


సెంచరీ సాధించిన మనోజ్‌సాయి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు ఫైనల్‌కు చేరాయి. శనివారం ఆర్డీటీ స్టేడియంలో ఆర్‌వీకే మెమోరియల్ సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు మూడో రోజు కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో హైదరాబాద్, సర్వీసెస్ జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 135పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 19.5 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసి 2వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. 34పరుగులు, వికెట్ తీసి జట్టు విజయంలో కీలకపాత్రపోషించిన సాయినాథ్‌చారి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. మరో మ్యాచ్‌లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 189పరుగులు చేసింది. ఇందులో మనోజ్‌సాయి సెంచరీ సాధించారు. అనంతరం బరిలోకి దిగిన తమిళనాడు జట్టు 19.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 190పరుగులు చేసింది. ఎస్‌పీ నాథన్ 73పరుగులు చేసి తమిళనాడు జట్టును 4వికెట్ల తేడాతో గెలిపించి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. దీంతో వరుసగా చెరో మూడు మ్యాచ్‌లు గెలిచిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు ఆదివారం ఫైనల్‌లో తలపడనున్నాయి. కార్యక్రమంలోజిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ ఎంఎస్ కుమార్, అపెక్స్ మెంబర్ ప్రసన్నకుమార్, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా వెటరన్ క్రికెట్ డైరెక్టర్ నాగప్ప, అధ్యక్షుడు కృష్ణమోహన్, సెక్రటరీ మధుకర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారి గుడి వద్ద నారాలోకేశ్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

అరచేతిలో అందుబాటులోకి 161 సేవలు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అరచేతిలోనే 161 సేవలు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పాతూరు బ్రహ్మంగారి ఆలయం వద్ద పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారాలోకేశ్ భారీ కటౌట్‌కు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. రాణినగర్‌లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాయల్ మురళీ, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచెపు వెంకటేష్, గుర్రం నాగభూషణం, పరమేశ్వరన్, కడియాల కొండన్న పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీలో గ్రామ సంఘం కార్యాలయంలో రూడ్ సెట్ ఆధ్వర్యంలో మహిళలకు జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీవెంకటనాయుడు, పంచాయితీ కార్యదర్శి హిదయతుల్లా, ఏరియా కో ఆర్డీనేటర్ సుభద్ర పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రభుత్వం మాది: ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రాణి నగర్, రహ్మత్ నగర్‌లలో పలువురికి ఎమ్మెల్యే పింఛన్ సొమ్మును అందజేశారు. నగరపాలక కమిషనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ అనంతపురంరూరల్ మండలంలోని అనంతపురం రూరల్ పంచాయతీ టీవీ టవర్, ఎన్టీఆర్ కాలనీల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లబ్ధిదారులకు శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి మునిప్రసాద్, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు, సర్పంచు ఉదయ్‌శంకర్, టీడీపీ జయరాంనాయుడు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన ఎంఎస్ రాజు


శాప్ చైర్మన్ రవినాయుడుకు బొకే అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు ఎంఎస్ రాజు శనివారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్‌మురళీ కలిశారు. పరస్పరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించుకున్నారు. టీడీపీ నాయకులు, తెలుగుయువత, క్రీడాసంఘాల నాయకులు శాప్‌చైర్మన్‌కు స్వాగతం పలికారు.

ఉచిత గుండె పరీక్షలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంతపూర్ క్లబ్‌లో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె పరీక్షలలో ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. సవేరా ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. రోటరీక్లబ్ అనంతపూర్ సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు భవాని రవికుమార్, గల్లా హర్ష, సభ్యులు కేశవరెడ్డి, మేడా అరవింద్‌కుమార్, లైక్వాండో శాంతరాజ్, విశ్రాంత వార్డెన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్వేతారెడ్డి, మేడా రామలక్ష్మి, జయంతి పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి

రామగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోదుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ మండలంలోని పేరూరు గ్రామంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరంటీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండలంలోని వడ్డెర్లు, టీడీపీ నాయకులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గొడవ సరే.. గాయాలైనా కేసులు కట్టని పోలీసులు

● ఎస్పీకి విన్నవించినా దిక్కులేదు


గాయపడిన లక్ష్మీదేవి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌లో స్థలం విషయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం కొన్ని నెలలుగా జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గత నెల 27వతేదీన ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఫిర్యాదుల పరిష్కార వేదికలో తాజాగా రమాదేవి తన భర్త రామాంజనేయులు దివ్యాంగుడని, కానీ తమను దూషిస్తున్నారని, వారితో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసింది. కానీ వన్‌టౌన్ పోలీసులు పట్టించుకోలేదు. రామాంజనేయులు, కొండారెడ్డిల మధ్య శుక్రవారం మరోసారి గొడవ జరిగింది. ఘర్షణలో రామాంజనేయులు తరపున లక్ష్మీదేవి, రమాదేవిలకు గాయాలయ్యాయి. కొండారెడ్డి తరపున సాహెబీకి గాయమైంది. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీ అయినప్పటికీ పోలీసులు తూతూమంత్రంగా వచ్చి వివరాలు రాసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంలో వన్‌టౌన్ ఎస్ఐ ఒకరు పంచాయతీ చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఆయన పలు సార్లు ఇరువర్గాలతో మాట్లాడినా సమస్య సద్దుమణగలేదు. ఇప్పుడు ఆయన ప్రత్యేకంగా చూస్తున్నారేమో. శనివారం రాత్రయినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం క్రైం,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు అసభ్యంగా సైగలు చేసిన వ్యక్తిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని హౌసింగ్‌బోర్డులో ఉషోదయ రోహిణి మెడికల్‌షాపుకు తరచూ బుల్లే జనార్దన్ అనే వ్యక్తి వచ్చేవాడు. సమీపంలోని ఓ మహిళతో అసభ్యంగా సైగలు చేసేవాడు. శనివారం ఆ మహిళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించిన మొదటి ఏపీ అండర్-23 పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు 13 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఇందులో ఫైనల్ పోటీల్లో చిత్తూరుపై 8పాయింట్ల తేడాతో ఓడిపోయిన జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. రాష్ట్రహైకోర్టు జడ్జి జస్టిస్ సురేశ్‌రెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందుకుంది. రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్టుకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి అభినందనలు తెలిపారు.


రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు